క్లుప్తంగా

ప్రజలు ఆర్టీసీని ఆదరించండి

మిర్యాలగూడ టౌన్ : బస్సులోనే ప్రయాణించి ఆర్టీసీని ఆదరించండని డీఎం పాల్ అన్నారు. శుక్రవారం నిర్వహించిన 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమంలో ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు, సలహాలను స్వీకరించారు. గ్రామీణ ప్రాంతాలకు ప్రయాణీకుల రద్దీని బట్టి బస్సులను నడిపిస్తామని తెలిపారు.

తేమ శాతాన్ని గుర్తించాలి

చింతపల్లి : మండలంలోని రైతులు పత్తి కొనుగోలు కేంద్రాలకు పత్తిని తీసుకొచ్చే క్రమంలో తేమ శాతాన్ని గుర్తించాలని మండల వ్యవసాయ అధికారి శ్రావణకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని చింతపల్లి, గొడుకొండ్ల, వింజమూరు రైతు వేదికల్లో తేమ శాతాన్ని గుర్తించే పరికరాలు అందుబాటులో ఉన్నాయని, ఆయా గ్రామాల్లో ఏఈఓలను సంప్రదించి 8శాతం తేమ ఉండే విధంగా చూసుకోవాలన్నారు.

నేడు క్షయవ్యాధిపై వైద్యశిబిరం

పెద్దవూర : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం క్షయ(టీబీ) వ్యాధికి సంబంధించి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి నగేష్ శుక్రవారం తెలిపారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, రాత్రిపూట చెమటలు, పట్టడం, ఆకలి లేకపోవడం వంటివి టీబీ లక్షణాలుగా గుర్తించాలన్నారు. ఈ లక్షణాలు ఉన్నవారికి ఎక్స్‌రే, తెమడ, రక్త పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు పేర్కొన్నారు. దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, బీపీ, షుగర్, హెచ్‌ఐవీ, క్యాన్సర్ రోగులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టీబీ నిర్ధారణ అయితే చికిత్స పూర్తయ్యే వరకు ప్రతి నెలా రూ.500ల పోషణ భత్యం లభిస్తుందని తెలిపారు.

వార్షికోత్సవాలను విజయవంతం చేయాలి

మిర్యాలగూడ అర్బన్ : కల్లుగీత కార్మిక సంఘం 66వ వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చౌగాని సీతారాములు శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పట్టణంలోని టీఎన్‌ఆర్ గార్డెన్స్‌లో శనివారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కల్లుగీత కార్మికులు భారీగా ఈ వార్షికోత్సవ సభకు హాజరుకావాలన్నారు. ఈ సభలో కార్మికుల సమస్యలు వాటి పరిష్కారానికి ఉద్యమాల రూపకల్పన వంటి విషయాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు.

దేవాలయ నిర్మాణానికి భూమి పూజ

చందంపేట : మండలంలోని మానావత్‌తండా గ్రామపంచాయతీ పరిధిలోని చంద్రునాయక్ తండాలో నూతనంగా నిర్మిస్తున్న తుల్జా భవాని, మేరమ్మ అమ్మవారి దేవాలయ నిర్మాణానికి శుక్రవారం దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దైవ చింతనతో మానసిక ప్రశాంత చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రమావత్ మోహన్‌కృష్ణ, వెంకట్‌రెడ్డి, గోపి, పెద్దులు, శంకర్‌నాయక్, చందర్‌సింగ్, లోక్యానాయక్, పాండునాయక్, సందీప్, లక్పతి, సోమ్లా, భాస్కర్, కొండల్, భాను, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయాలి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : ఈ నెల 29న హాలియాలో నిర్వహించనున్న గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఏబీఎస్‌ఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు కేతావత్ బిక్షానాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మండల ముఖ్య గిరిజన నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి తండా నుంచి గిరిజనులు అత్యధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు ఇస్లావత్ బాలు, రమావత్ శంకర్‌నాయక్, ఇస్లావత్ చందు, రామారావు, ఎంపీటీసీ పాండు, దేవుడు, హాతీరాం, భనురాథోడ్, మార్కెట్ డైరెక్టర్ హరికృష్ణ, చందర్, శంకర్ పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం అందించాలి



దామరచర్లలో ఎండిపోయిన పంటలను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మిర్యాలగూడ : సాగునీటి కొరత, విద్యుత్ కోతలతో ఎండిపోయిన పంట పొలాల రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని దామరచర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం దామరచర్ల మండల కేంద్రంలో ఎండిన పంట పొలాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇప్పటికైనా ప్రభుత్వం నష్టపోయిన పంటకు తగిన నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అల్లం నాగరాజు, కొమ్ము దాసు, విజయ్, శ్రీను, సద్దాం, రామయ్య, శివచరణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వ్యతిరేకంగా కాంగ్రెస్ కుట్ర

- సాగర్ ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా : రైతు బంధు పథకాన్ని ఆపాలని కుట్ర చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేయడం దుర్మార్గమైన చర్య అని ఎమ్మెల్యే నోముల భగత్ విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సీఎం కేసీఆర్ ఆరేళ్ల కిందట రైతు బంధు పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రైతు బంధు పథకాన్ని ఆపాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం సిగ్గుచేటన్నారు. రైతు బంధు పథకాన్ని ఆపాలని చూస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలకు నిరసనగా గ్రామాల్లో రైతులు కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మలను దహనం చేయాలన్నారు. ట్రికార్ చైర్మన్ రాంచందర్ నాయక్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ ఘన విజయం సాధించడం తథ్యమన్నారు. అనంతరం నిడమనూరు మండలంలోని



గుర్రంపోడు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే భగత్, పక్కన ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

ముప్పారం, వెంగన్నగూడెం గ్రామాలకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు ఎమ్మెల్యే నోముల భగత్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ వెంకటేశ్వర్లు, మర్ల చంద్రారెడ్డి, రవి, సత్యం, నిడమనూరు యూత్ అధ్యక్షుడు ఉన్న బాస్కర్, ఎంపీటీసీ చిలుముల సంతోష్, లింగప్ప. వెంకటరమణ, బొల్లం సైదులు ఉన్నారు.

గుర్రంపోడు : కాబోయే ముఖ్యమంత్రిని, సుదీర్ఘ రాజకీయ అనుభవం అంటూ చెప్పుకుంటున్న నాయకుడు 40ఏళ్లలో చేయలేని అభివృద్ధిని తాను రెండున్నర ఏళ్లలో ఎమ్మెల్యేగా అంతకంటె ఎక్కువే అభివృద్ధి చేశానని ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ప్రజా ఆశ్వీరాద బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. తన హయాంలో రూ.54కోట్లతో మండలంలో అభివృద్ధి పనులు తీసుకుని వచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు కేసీఆర్‌తోనే సాధ్యమని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్ ఆశీర్వదించిన బీఆర్‌ఎస్ అభ్యర్థి నోముల భగత్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ సభలో ట్రికా చైర్మన్ రాంచందర్ నాయక్, గీత కార్మిక కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్, గుత్తా అమిత్, కడారి అంజయ్య యాదవ్, జెడ్పీ వైస్ చైర్మెన్ ఇరిగి పెద్దులు, జిల్లా ఎంపీపీల ఫోరం అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, నియోజకవర్గ నాయకులు, మండల పార్టీ అధ్యక్షుడు గజ్జెల చెన్నారెడ్డి, రామగిరి చంద్రశేఖర్ రావు, టీఆర్‌ఎస్వీ నాయకుడు పిల్లి అభినయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



చింతపల్లి : పోలీస్‌స్టేషన్ పరిశీలిస్తున్న ఎస్పీ



డిండి : ఎర్రారంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

చింతపల్లి : అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రాజకీయ పార్టీల నేతలతోపాటు ప్రతి ఒక్క ఓటరూ సహకరించాలని జిల్లా ఎస్పీ అపూర్వరావు కోరారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం జిల్లా ఎస్పీ అపూర్వరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని పోలింగ్ బూత్‌లు, సమస్యాత్మక బూత్‌ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర రహదారిపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడుతూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం చింతపల్లిలోని చెక్ పోస్టును పరిశీలించారు. సాయిబాబా దేవాలయంలో పూజలు నిర్వహించారు.

శాంతి భద్రతల పరిరక్షణకే ఫ్లాగ్ మార్చ్

డిండి : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా శాంతి భద్రతల పరిరక్షణకే ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు డిండి రూరల్ సీఐ ఎస్ఐ సురేశ్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలైన బొగ్గులదొన, ప్రతాప్‌నగర్, గోనబోయనపల్లి, ఎర్రారం గ్రామాల్లో ఇండో టిబిటన్ బార్డర్ పోలీస్ కమాండర్లతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ.సైదులు, ఐటీబీపీ కమాండర్లు పాల్గొన్నారు.

రైతుబంధు సాయం రూ.16వేలకు పెంచుతాం

- మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : సీఎం కేసీఆర్ నేతృత్వంలో రానున్న తెలంగాణ ప్రభుత్వంలో రైతుబంధు సాయం ఎకరాకు రూ.16వేలు పెంచి ఇస్తామని మిర్యాలగూడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ మండలంలోని బాదలాపురం, అవంతీపురం, యాద్గార్‌పల్లి, కాల్వపల్లితండా, కాల్వపల్లి, ఊట్లపల్లి తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోలో అన్ని వర్గాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. రైతు బీమా తరహాలోనే జీవిత బీమా చేసి ఆయా కుటుంబాలకు అండగా నిలుస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం మిర్యాలగూడ మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి



అవంతీపురంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ నూకల సరళహన్మంతరెడ్డి, వైస్ ఎంపీపీ అమరావతి సైదులు, మండల రైతు బంధు సమితి అధ్యక్షుడు గడగోజు ఏడుకొండలు, ఏఎంసీ మాజీ చైర్మన్ ధనావత్ చిట్టిబాబునాయక్, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మట్టపల్లి సైదులుయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ వెలిశెట్టి రామకృష్ణ, నాయకులు సంజీవరెడ్డి, లింగయ్య ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

త్రిపురారం : రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని నాగార్జున సాగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బెజ్జికల్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్ ఇండ్ల జానకి రాములు ఆధ్వర్యంలో బెజ్జికల్ సర్పంచ్ గజ్జెట కోటిరెడ్డి, ఇంజం హనుమారెడ్డి, పాదల నాగమ , నూనె రాములు తోపాటుగా 52 కుటుంబాలు, త్రిపురారంలో ఆలంపల్లి జానయ్య ఆధ్వర్యంలో 10 కుటుంబాలు, నీలాయి గూడెంలో 25కుటుంబాలు, అభంగాపురం గ్రామంలో రాయించు జానయ్య, ఎంపీటీసీ జిల్లా రేణుఖ ఆధ్వర్యంలో 10 కుటుంబాలు బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా జైవీర్‌రెడ్డి వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని, భారీ మెజార్టీ కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చి రెడ్డి, ఎంపీపీ గౌరవ సలహాదారు అనుముల శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ బిట్టు రవి కుమార్, డైరెక్టర్ మెరుగు నాగేందర్, బిట్టు సత్యనారాయణ, కసిరెడ్డి నరేష్, మహిళ అధ్యక్షురాలు పద్మ, అనుముల వెంకట్ రెడ్డి, చిలుముల శ్రీనివాస్, సలికంటి బాలకృష్ణ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



త్రిపురారం : బెజ్జికల్ సర్పంచ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి జైవీర్‌రెడ్డి

పెద్దవూర : మండలంలోని పోతునూరు గ్రామానికి చెందిన ఇరవై కుటుంబాలు మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి శుక్రవారం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కుందూరు జైవీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఆయన పార్టీ కండువాలను కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో తెల్పాటి మహేందర్‌నాథ్, దున్న ఏడుకొండలు, దున్న అరుణ్, వినోద్‌కుమార్, తరి నరేష్, బొడ్డు వేణు, వెంకటేష్, సింగం మహేష్, గార్లపాటి మధు, తెల్పాటి మధు, రెడ్డి శ్రీనివాసులు, సాయి, వెంకటేశ్వర్లు, రామాచారి, అక్కులు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, నర్సిరెడ్డి, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దు

మిర్యాలగూడ : అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో అధికారులు, సిబ్బంది ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ చెన్నయ్య అన్నారు. శుక్రవారం స్థానిక కేఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండురోజులపాటు పీఓలు, ఏపీఓలుకు నిర్వహించే శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో సిబ్బంది ఎలాంటి తప్పులు జరగకుండా చూసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి తగు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలాజీనాయక్, ఆయా మండలాల తహసీల్దార్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు, సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇస్తున్న ఆర్డీఓ చెన్నయ్య

కాంగ్రెస్‌పై తప్పుడు ప్రచారాలు చేస్తున్న బీఆర్‌ఎస్

మిర్యాలగూడ : ఎన్నికల్లో లబ్ధి పొందడానికి బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని దామరచర్ల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం దామరచర్లలో ఆయన మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు రైతుబంధు పథకాన్ని నిలిపివేయాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిందని అసత్య ఆరోపణలు చేస్తున్నారని, ఇది సరికాదన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు మానుకోకపోతే జరగనున్న ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ సమావేశంలో శ్రీనివాస్, నాగరాజు, కొమ్ము దాసు, విజయ్, సద్దాం, జాకీర్, రామయ్య, శివచరణ్ తదితరులు పాల్గొన్నారు.

మాడుగులపల్లి : బీఆర్‌ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జెడ్పీటీసీ పుల్లెంల సైదులుతో కలిసి శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరినట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని తెలిపారు. ఒక గ్రామంలో మొత్తం 500 ఓటర్లుంటే 300 మంది బీఆర్‌ఎస్‌లో చేరారని చెప్పడం హాస్యాస్పదమన్నారు. రైతుబంధును నవంబర్ 2లోగా ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ ఈసీకి నివేదిస్తే సాయాన్ని అడ్డుకుంటున్నారని ఆరోపించడం సిగ్గుచేటని విమర్శించారు. స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు రేవంత్ రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేయడాని జెడ్పీటీసీ సైదులు తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పుల్లెంల నర్సింహ, బట్టు మాధవరెడ్డి, ఎరుకల వెంకన్న, ఆరూరి నరేష్, కంకణాల పింగళిరెడ్డి, నాగిరెడ్డి, కట్టా సిద్ధార్థరెడ్డి పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి మాటలను వక్రీకరించడం హేయమైన చర్య



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

మిర్యాలగూడ: రైతుబంధు నగదును నవంబర్ 2లోపు రైతులకు అందించాలని డిమాండ్ చేసిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాటలను బీఆర్‌ఎస్ నాయకులు వక్రీకరించడం హేయమైన చర్య అని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. శుక్రవారం మిర్యాలగూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రైతుబంధును నిలిపివేయాలని కాంగ్రెస్ నేతలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయకున్నా చేశారని బీఆర్‌ఎస్ ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. మిర్యాలగూడ టికెట్‌ను ఎవరికి కేటాయించినా అందరూ కలిసికట్టుగా ఉండి అభ్యర్థిని గెలిపించుకోవాలన్నారు. సమావేశంలో టీపీసీసీ సభ్యుడు చిరుమర్రి కృష్ణయ్య, నాయకులు పడిగి రామలింగయ్య, ఎం.నర్సిరెడ్డి, సలీం, ఆరిఫ్, పొదిల శ్రీనివాస్, టి.సైదులు, మాలికాంతారెడ్డి, బసవయ్యగౌడ్, బక్కారెడ్డి, ఎస్.వెంకటేశ్వర్లు, లింగయ్యయాదవ్, కె.శ్రీనివాస్‌రావు, చాంద్‌పాషా, గౌస్, సురేష్, సర్పంచ్ నూకపంగు శ్రీనివాస్, అజయ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ విజయానికి బాటలు

- దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

కొండమల్లేపల్లి : తొమ్మిదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలే రాబోయే ఎన్నికల్లో విజయానికి బాటలు వేస్తాయని ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని వద్యతడా, గాజినగర్, చింతచెట్టుతండా, కొల్ముతలపహాడ్, రామునిగుండ్లతండా, కొత్తబావి, కేశ్యతండా, గుర్రపుతండా, దంజిలాల్‌తండా, గన్యనాయక్‌తండా, ఆంగోతుతండా, చెన్నారం గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గుత్తా అమిత్‌రెడ్డి, కేతావత్ బిల్యానాయక్, పస్నూరి యుగంధర్‌రెడ్డి, కేసాని లింగారెడ్డి, రమావత్ దస్రూనాయక్, మేకల శ్రీనివాస్‌యాదవ్, రమావత్ తులసిరాం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసే బీఆర్‌ఎస్‌లోకి వలసలు

డిండి : రాష్ట్రంలో గడిచిన తొమ్మిదిన్నరేండ్ల పాలనలో సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసే బీఆర్‌ఎస్ పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం దేవరకొండలో మండల పరిధిలోని ఉమ్మడి బొగ్గులదొన గ్రామపంచాయతీలోని వివిధ పార్టీలకు చెందిన దాదాపు 50 మంది కార్యకర్తలను ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. ఆయన వెంట ఆ పార్టీ నాయకులు బిల్యానాయక్, తండు వెంకటయ్య, శ్రీను, చంద్రయ్యగౌడ్, తులసీరామ్ తదతితరులున్నారు.



కొండమల్లేపల్లి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్, చిత్రంలో గుత్తా అమిత్‌రెడ్డి

కొండమల్లేపల్లి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీ తట్టుకోలేకపోతుందని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని దంజిలాల్‌తండాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట నాయకులు బిల్యానాయక్, శ్రీనివాస్‌యాదవ్, యుగంధర్‌రెడ్డి, లింగారెడ్డి, దస్రూనాయక్, భీమ్‌సింగ్ పాల్గొన్నారు.


రోడ్డు విస్తరణకు భూ సేకరణ సర్వే



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణంలోని జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా శుక్రవారం రెవెన్యూ అధికారులు భూ సేకరణ సర్వే నిర్వహించి మార్కింగ్ చేశారు . కలాల్‌వాడ నుంచి తహసీల్దార్ కార్యాలయ సమీపంలో గల ప్రధాన డ్రైయినేజీ(నాలా) వరకు రోడ్డుకు ఇరువైపులా 42 ఫీట్ల చొప్పున మార్కింగ్ చేశారు. గతంలో వంద ఫీట్ల రోడ్లని చెప్పి 90ఫీట్లు చేసి నేడు ఆ రోడ్డును 84ఫీట్లు చేశారు. కాగా వంద ఫీట్ల వరకు రోడ్డు వెడల్పు చేస్తే 20 నుంచి 25 ఫీట్ల వరకు ఒక వైపు గృహాలు, మరో వైపు దుకాణాలు పోతున్నాయి. దీంతో ఆందోళనకు గురైన బాధితులు స్థానిక ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావుకు విన్నవించుకోవడంతో 84 ఫీట్లకు జాతీయ రహదారిని తగ్గించినట్లు తెలుస్తుంది. అయితే 84 ఫీట్ల రోడ్డు చేసినప్పటికి 10 నుంచి 15 పీట్ల మేరకు రోడ్డు కింద దుకాణాలు, గృహాలు పోతున్నట్లు సర్వేయర్లు తెలిపారు. ఇప్పటికే ఈ రోడ్డులో ప్రధాన డ్రెయినేజీ నుంచి ప్రభుత్వ జూనియర్ కలశాల వరకు రోడ్డు వెడల్పు చేసి డ్రెయినేజీ నిర్మాణాలను ముమ్మరంగా చేపడుతున్నారు. ఈ సర్వేలో రెవెన్యూ సర్వేయర్లు నాగార్జున, లక్ష్మణ్, రాము, సత్యనారాయణలతో పాటు జాతీయ రహదారి కన్సల్టెంట్లు ఉన్నారు.

అసమ్మతివాదులకు ఎమ్మెల్యే బుజ్జగింపులు



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గురువయ్య యాదవ్, పక్కన ఎమ్మెల్యే భగత్

నిడమనూరు : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని బీఆర్‌ఎస్‌లో అసమ్మతివాదులను ఎమ్మెల్యే భగత్ బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నాడు. మండలంలోని వివిధ గ్రామాల్లో అసమ్మతితో ఎవరున్నారు. పార్టీ మారే ఆలోచ ఎవరు చేస్తున్నారనే వివరాలు తెలుసుకుని వారిని బుజ్జగించే పనిలో నిమగ్నమయ్యాడు. ముఖ్యంగా ఎమ్మెల్యే సొంత సామాజిక వర్గం నేతలు ఎవరూ చేజారిపోకుండా చూసుకునే పనిలో పడ్డారు. ఇటీవల నిడమనూరు మాజీ సర్పంచ్ బొల్లం బాలయ్య యాదవ్, ఆయన కుమారుడు న్యాయవాది బొల్లం శ్రీనివాస్ యాదవ్, వల్లభాపురానికి చెందిన మాజీ సర్పంచ్ నన్నెబోయిన బాలయ్య యాదవ్, మాజీ ఎంపీటీసీ చిమట చెన్నయ్య, మరి కొందరు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. మొదటి నుంచి టిక్కెట్ ఆశిస్తూ వచ్చిన మన్నెం రంజిత్ యాదవ్ సైతం ఎమ్మెల్యే సరైన గౌరవం ఇవ్వడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తూ బీజేపీలో చేరారు. వీరే కాకుండా మండలంలోని ఐకేగూడ సర్పంచ్ అంకతి నర్మద, ఆమె భర్త రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్‌గా ఉన్న అంకతి వెంకటరమణ, వెంగన్న గూడెం సర్పంచ్ పూర రవి, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, నిడమనూరు మాజీ ఎంపీటీసీ, న్యాయవాది ఉన్నం చిన వీరయ్యలు సైతం పార్టీ మారారు. దీంతో పార్టీలోంచి మిగతా వారు వేరే పార్టీలోకి వెళ్లకుండా ఉండేందుకు వారిని వ్యక్తిగతంగా కలిసి బుజ్జగింపులు చేస్తున్నారు. అందులో భాగంగా శాఖాపురం మాజీ సర్పంచ్ చిన్నాల సుజాత వెంకటయ్య యాదవ్‌ను కలిశారు. తర్వాత మాజీ ఎమ్మెల్యే జి రామ్మూర్తి యాదవ్ అల్లుడు, వెనిగండ్లకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు కట్టెబోయిన గురువయ్య యాదవ్‌ను నేరుగా మంత్రి కేటీఆర్ వద్దకు తీసుకెళ్లి కలిపించాడు. ఎన్నికల్లో భగత్‌ను గెలిపించుకు రండి తర్వాత మీకు న్యాయం చేస్తాం అని కేసీఆర్ చెప్పినట్లు తెలిసింది. గత ఉప ఎన్నికల సమయంలో సైతం కట్టెబోయిన గురవయ్యతో ముఖ్యమంత్రి, కేసీఆర్ ఫోన్‌లో మాట్లాడి న్యాయం చేస్తా పార్టీ అభ్యర్థి గెలుపునకు సహకరించాలని కోరిన సంగతి తెలిసిందే. అసమ్మతి, అసంతృప్తి నాయకులు ఎంత వరకు భగత్‌కు సహకరిస్తారో వేచి చూడాల్సిందే.

నేడు గ్రహణం సందర్భంగా ఆలయాల మూసివేత

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని శ్రీ మీనాక్షి అగస్తేశ్వరస్వామి, శ్రీలక్ష్మీనరసింహాస్వామి ఆలయాలను శనివారం చంద్రగ్రహణం సందర్భంగా మధ్యాహ్నం ఒంటి గంట తరువాత మూసివేస్తున్నట్లు చైర్మన్ కొందూటి సిద్ధయ్య, మేనేజర్ కుంకపాక మృత్యుంజయశాస్త్రిలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంటిగంట వరకు స్వామివారికి దర్శణాలు, అభిషేకాలు నిర్వహించి ఆ తరువాత ఆలయ ద్వారబంధనం చేసి తిరిగి 29న ఆలయాన్ని శుద్ధి చేసి ఉదయం 8గంటల నుంచి భక్తులకు పునఃదర్శనం, పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కరెంట్ సక్రమంగా ఇవ్వాలని రైతుల ధర్నా

త్రిపురారం : వ్యవసాయానికి కరెంట్ సక్రమంగా రావడంలేదని మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు శుక్రవారం త్రిపురారం సబ్ స్టేషన్ ఎదుట సాగర్ రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ప్రభుత్వం చెబుతున్న విధంగా 24 గంటల కరెంట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పొలాలు పొట్ట దశలో ఉండడంతో విద్యుత్ అధికారులు ఇష్టానుసారంగా కరెంట్ కోతలు విధిస్తుండడంతో పొలాలు ఎండి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో కరెంట్ ఉండడం లేదన్నారు. రైతులు రోడ్డుపై ధర్నా చేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అనంతరం విద్యుత్ అధికారులు రైతులకు సర్దిచెప్పడంతో ధర్నా విరమించారు.



త్రిపురారం : సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి

హాలియా : దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించే అంశాన్ని రాజకీయ పార్టీలు అసెంబ్లీ ఎన్నిక మేనిఫెస్టోలో చేర్చాలని దివ్యాంగుల యువజన సంఘం (డీవైఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తలారి శంకర్ అన్నారు. శుక్రవారం హాలియాలో నిర్వహించిన ఆ సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 75ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో రాజ్యాధికారినికి దూరమై దుర్భర జీవితాలు గడుపుతున్న దివ్యాంగుల సమాజానికి రాజకీయ రిజర్వేషన్లు కల్పించేందుకు అన్ని రాజకీయ పార్టీలు ముందుకు రావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోలో ఎలాంటి హామీ ఇవ్వకపోక కేవలం ఫించన్‌కే పరిమితం చేసి ఓట్లు దండుకోవాలని చూస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర నాయకులు పిల్లి బాలకృష్ణ, సిద్దావలి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌కు పాలకమండలి ఏర్పాటు చేయాలి



'చలో హైదరాబాద్' కరపత్రం ఆవిష్కరిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణ విశ్వబ్రాహ్మణ కోఆపరేటీవ్ కార్పొరేషన్‌కు పాలక మండలిని ఏర్పాటు చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గడగోజు చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శి చేర్యాల వెంకటాచారి, అన్నభిమోజు నాగార్జునచారి అన్నారు. శుక్రవారం పట్టణంలోని జేసీ భవన్‌లో ఆ సంఘం సన్నాహక సమావేశం నిర్వహించారు. ముందుగా నవంబరు 5న హైదరాబాద్‌లో నిర్వహించే విశ్వబ్రాహ్మణ సంఘం మహాగర్జన సభ కరపత్రాన్ని ఆవిష్కరించి వారు మాట్లాడారు. తెలంగాణలో రజకులు, నాయీ బ్రాహ్మణుల మాదిరిగానే విశ్వబ్రాహ్మణులకు ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. వడ్రంగీ వృత్తిదారులపై ఫారెస్ట్ అధికారుల వేధింపులను ఆపాలని, అలాగే మూత బడ్డ కట్టె కోత మిషన్లను తెరిపించాలని కోరారు.కార్మిక బీమా కింద రూ.5లక్షలు వర్తింపజేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు మండలోజు సైదాచారి, యినుగుర్తి గోవర్ధనాచారి, కాంచనపల్లి సైదాచారి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఈశ్వరాచారి, తాడోజు శ్రీనివాసాచారి, శ్రీపాద లోకాచారి, అనుముల దుర్గాచారి, దేవులపల్లి శ్రీనివాస్‌చారి, దేవులపల్లి అశోక్, మధు, బ్రహ్మచారి, కాతోజు వాసు, కోటయాచారి, బీష్మాచారి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

మాడుగులపల్లి : పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బంది లేకుండా అన్ని వసతులు కల్పించాలని తహసీల్దార్ జమీరొద్దీన్ సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, దివ్యాంగులకు ఇబ్బంది లేకుండా ర్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. వసతులు లేని పోలింగ్ కేంద్రాల్లో కల్పనకు కలెక్టర్ నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జితేందర్ రెడ్డి, ఎంపీఓ రవికుమార్, పీఆర్‌ఏఈ నరేష్ కుమార్, ఏపీఓ శ్రీనివాస్‌రెడ్డి, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ జమీరొద్దీన్